ఎంపీ ఉప ముఖ్యమంత్రికి చినజీయర్ స్వామి ఆశీస్సులు



ఎంపీ ఉప ముఖ్యమంత్రికి మంగళశాసనాలిస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్ల మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న సమతా స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజులు ఆయన ఇక్కడ పర్యటించారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. శుక్రవారం దివ్య సాకేతాలయంలో నిర్వహించిన నారసింహ హవన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మికత, మన ధర్మం, సంస్కృతి దేశానికి గొప్ప శక్తిలాంటివని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.

అక్రమంగా తీసుకొచ్చిన మద్యం బాటిళ్ల స్వాధీనం

శంషాబాద్: వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్ల ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకుంది. శంషాబాద్ రహదారిలో శుక్రవారం ఉదయం చేపట్టిన తనిఖీల్లో విమానాశ్రయం నుంచి వచ్చిన ప్రయాణికులతో పాటు రోడ్డు మార్గాన వచ్చిన ప్రయాణికుల వాహనాల్లో మొత్తం 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని గోవా, హరియాణా తదితర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.3.84 లక్షలుగా ఉంటుందని వివరించారు. మద్యం బాటిళ్లను ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

తొండుపల్లిలో భారీగా ట్రాఫిక్ జామ్



తొండుపల్లిలో ఆగిపోయిన వాహనాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లిలో శుక్రవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. తొండుపల్లి ఫ్లైఓవర్‌తో పాటు ఇరువైపుల సర్వీసు రోడ్లలో వాహనాలు భారీ ఎత్తున నిలిచిపోయాయి. భారీ వర్షాలు.. మొరాయించిన వాహనాల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయినట్లు స్థానికులు పేర్కొన్నారు. సుమారు గంట పాటు ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



భారీ వర్షం.. అతలాకుతలం!

లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన వరద
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- గ్రామాల్లోకి చేరిన వరద నీరు



హైదర్‌గూడ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



నిండు కుండలా మారిన మీరాలం చెరువు



మల్కారం గ్రామంలోకి చేరిన వరదనీరు



వర్షంలో వెళ్తున్న వాహనాలు

రాజేంద్రనగర్ జోన్ బృందం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురు, శుక్రవారాల్లో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాదచారులు, వాహనదారులు వరద కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా నెలకొన్న ఇబ్బందుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దని, మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇంటికే పరిమితం కావాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సూచించారు. విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్‌రావు తెలిపారు.

శంషాబాద్ మండల పరిధిలో...

శంషాబాద్ రూరల్: భారీ వర్షాలకు శంషాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మండల పరిధిలోని ఈసీ, ఎంటేరు వాగుల్లో భారీగా వరద పారుతోంది. మల్కారం, కేబీ దొడ్డి, సుల్తాన్‌పల్లి, శివారులో ఈసీ వాగు పరివాహక ప్రాంతంలోని పంట పొలాలు నీట మునిగాయి. మల్కారంలో వరదనీరు గ్రామంలోకి రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నిండుకుండలా ఉన్న అన్ని చెరువులు, కుంటల నుంచి వరద అలుగు పారుతోంది. దీంతో హిమాయత్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు చేరుతుంది.



మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం



మైలార్‌దేవ్‌పల్లిలో...



శంషాబాద్ మండలం కేబీ దొడ్డి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

కార్మిక సమస్యలపై అవిశ్రాంత పోరు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో రాజేంద్రనగర్ మండల సీఐటీయూ నాయకుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జీఎం గట్టయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఐదు డివిజన్‌ల పరిధిలోని కార్మికుల సమస్యలను అధ్యయనం చేస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం పని చేయాలని సీఐటీయూ శ్రేణులకు సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు శ్రమ దోపిడీ జరిగేలా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. వెంటనే వీటిని రద్దు చేసి కనీస వేతనాలు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసి ఎన్నికల మేనిఫెస్టో కార్మికుల వేతనాలు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు.

నూతన కమిటీల నియామయం

రాజేంద్రనగర్ మండలంలోని ఐదు డివిజన్‌లకు సీఐటీయూ నూతన కమిటీలను నియమించారు. 30 మందితో కమిటీలను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ డివిజన్‌కు ఎస్.మోహన్, అత్తాపూర్ డివిజన్‌కు బచ్చలకూర స్వామి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు పి.సి.కె.భాస్కర్, సులేమాన్‌నగర్ డివిజన్‌కు కాలే రాజు, శాస్త్రీపురం డివిజన్‌కు బి.వెంకటయ్య, వీరిని డివిజన్ కన్వీనర్‌లుగా ఎన్నుకొని కమిటీ సభ్యులుగా మిగతా వారిని ఎన్నుకున్నారు. సీఐటీయూ సీనియర్ నాయకులు జి.ఎం.కురుమయ్య, ఎస్.జంగయ్య, పార్వతి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



అత్తాపూర్‌లో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ ఎస్ఈ మోహన్, డీఈ రత్నకర్‌రావు తదితరులు

అత్తాపూర్: విద్యుత్ సరఫరాలో అంతరాయం.. సమస్యలు... వినియోగం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ ఎస్ఈ డి.ఎస్. మోహన్, డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌రావు అన్నారు. భారీ వర్షాల కారణంగా అత్తాపూర్, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాలలో సంబంధిత అధికారులతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... వర్షాకాలంలో విద్యుత్ వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల దగ్గరకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నాని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం.. సమస్యలు తలెత్తితే ఆ సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలని ఎస్ఈ సూచించారు. కార్యక్రమంలో ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



డీసీకి వినతిపత్రమిస్తున్న నర్సింహ తదితరులు

అత్తాపూర్: అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వనం నర్సింహా కోరారు. అంబియన్స్ ఫోర్ట్ కాలనీలో అక్రమ నిర్మాణాలు, సర్వే నెంబర్ 375లో నిర్మిస్తున్న వాటిపై శుక్రవారం సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబియన్స్ పోర్ట్ కాలనీలో అక్రమంగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై ఈ నెల 20వ తేదీన సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. అయినా పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నారు. వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే సర్వే నెంబర్ 375లో శిఖ భూమిలో ఏడు ఎకరాల 23 గుంటల భూమి ఉందని ఇందులో 600 గజాల భూమికి అనుమతులు ఇవ్వడంతో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నేతలు మ్యాడం రామేశ్వర్‌రావు, చిట్టిగారి చిన్న తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



ఘనంగా బతుకమ్మ సంబరాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి ఆడి పాడి సందడి చేశారు.



రాజేంద్రనగర్‌లో...



పరిశోధన సంస్థలో...



నార్సింగి మున్సిపాలిటీలో కమిషనర్, మహిళా ఉద్యోగులు...



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు



లక్ష్మీగూడలో రజక సంఘం, బీఆర్ఎస్ నాయకులు...



బుద్వేల్ చౌరస్తాలో రజక సంఘం నేతలు...

నిప్పు కణిక ఐలమ్మ

- చాకలి ఐలమ్మ బాటలో యువత పయనించాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- ఐలమ్మకు ఘనంగా నివాళి

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో జరిగిన జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువత ఆమె చూపిన బాటలో పయనించి ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



శంషాబాద్‌లో రజక సంఘం నేతలు...



పోలీస్ అకాడమీలో ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ మురళీధర్, అధికారులు



బండ్లగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శరత్‌చంద్ర...



కోకాపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



ధర్మగిరిలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



మణికొండ ఓయూ కాలనీలో లక్ష్మీదేవిగా...

మహాలక్ష్మీ నమోస్తుతే



నార్సింగిలో పూజల్లో పాల్గొన్న మహిళలు



కుమారి పూజల్లో పాల్గొన్న చిన్నారులు



మణికొండ బంగారు మైసమ్మ ఆలయంలో...

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు బాలలు కుమారి పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. పూజా కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ బొప్పనాడు స్వాతి దత్తు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

మణికొండ పరిధిలో...

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నారు. రాత్రికి బతుకమ్మలు, దాండీయాలతో మహిళలు మండపాల వద్ద సందడి చేస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలు, మండపాలలో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమల వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తున్నారు.